# ఈ మనిషి
# ఈ లోకం!

గోదావరి స్టేషను నాకు తెలియందికాదు. 'మెయిలు' బ్రిడ్జి దాటి రాజమండ్రిలో అడుగుపెట్టీ పెట్టగానే, 'కూలి... కూలి...' అన్న కేకలు వినిపిస్తాయి. ఆ కేకలు, 'ఆకలి... ఆకలి...' అన్నట్లు, ఏవేవో ధ్వనుల్ని మన మస్తిష్కంలో ప్రకంపింపజేస్తాయి.

దడదడగా మెయిలు ఆగిపోతుంది. దిగేవారిని దిగనివ్వకుండా ఎక్కేవారిని ఎక్కనివ్వకుండా జనం—తమను తామే మోసగించుకుంటారు. తమకు అక్కరలేని స్థలాలు, ఇతరులకు దక్కకూడదనే కోరిక లేకపోయినా, అందుకు నిష్కారణంగా అడ్డుపడుతూ వుంటారు. తొందరకు, భయానికి బుర్ర ఉండదన్న నగ్న సత్యాన్ని ప్రదర్శిస్తారు.

ఈ రద్దీలో మా శివరావును చూడలేనేమో అన్న భయం వేసింది. భయం అంటే భయం కాదనుకోండి; అతను కనబడకపోతే, వాళ్ళింటికి వెళ్ళడానికి, నా మనసంత సంబర పడదు. కాని అతని ఇంటికి వెళ్ళాలని ఈ హృదయం తపిస్తుంది. అతనితో కలసి, అతని ఇంటికి వెళ్ళడానికి ఇబ్బంది పడని మనసు; ఎందుకు అతను లేకుండా, ఒంటరిగా చుట్టం చూపుగా అతని ఇంటికి వెళ్ళడానికి, వెనుకంజ వేస్తుందో ఓ పట్టాన అర్థం కాదు. అతనికీ నాకూ ఉన్న పరిచయం క్రొత్తది కాదు. పాతదైనా మరుగున పడిపోలేదు. ఈ బాధలన్నీ పడలేక స్టేషనుకు వచ్చి కలుసుకోవలసిందని, ఓ కార్డు అతనికి వ్రాయనే వ్రాశాను.

హిగిన్ బాదమ్స్ దగ్గర సాధారణంగా వాడికి నిలబడటం అలవాటు. కాని వాడక్కడ లేడు. మెల్లగా వాడ్ని వెదుక్కుంటూ స్టేషను బయిట పడ్డాను. వాడు మాత్రం ఎక్కడా కనిపించలేదు. 'కాళ్ళు' పీకిన నా ఉత్తరం, పాపం నా కాళ్ళు విరగ్గొట్ట ప్రయత్నించింది. కాని నేను ముందుకు త్రోసుక పోయాను.

గ్రాంఫులోని గళ్ళల్లా ఉన్న సందుల్లో రిక్షా; పడిపోయిన దుర్గంధ వృక్షాల్లాంటి కాలువల శక్తికి కంపించిపోతూ, గమ్యస్థానం చేరుకోడానికి కటకటలాడి పోతోంది.

వాడు నన్ను ఎన్నిసార్లో రమ్మని వ్రాశాడు. కాని నేను కదల్లేదు. అందుకనే ఈ హృదయంలో ఏదో గడబిడ. ఏదో మాట్లాడాలి అన్నతపన...తీరాకలసిన తరువాత, ఏమీ మాట్లాడలేక పోవొచ్చు.

అప్పుడే రిక్షా ఆ సందు మలుపు తిరిగింది.

అదే ఇల్లు...

ఔను అదే...

అదిగో...వాడే...

తెల్లని చొక్కా...తెల్లని షరాయి. వేషం నిరాడంబరంగా ఉంది. ఇంటి మెట్లుదిగి ఆ దిశగా నాలుగడుగులు వేశాడు.

ముగ్గురు పిల్లలతో అతని సతీమణి ఆ గుమ్మంలో నిలబడి ఉంది. ఆ విధంగా ఆమె అతన్ని గుమ్మం వరకు వచ్చి సాగనంపడం నన్ను ముగ్ధుణ్ణి చేసింది.

నేను చప్పట్లు చరిచాను. వాడు వెనక్కి తిరిగి చూశాడు.

ఒత్తుగా తేలిన జుట్టు, కప్పల్లా పైకి తేలిన కళ్ళల్లోని ఎర్రని జీరలు నన్ను భయపెట్టాయి!

నన్ను చూడగానే వాడు నవ్వలేదు. లేక నవ్వాడో... వాడు ఎంత చక్కగా నవ్వగలడు! కాని అతనిలో ఆ ఛాయలు లేవు.

అప్పుడే వాడు, 'రా...అలా పోదాం—' అంటూ, నన్ను వాళ్ళింటి లోనికి తీసుకొని వెళ్ళకుండా, అతను వెళ్తూన్న దిశగా నన్ను తీసుకొని పోయాడు. నాకు ఎందుకనో వెనుదిరిగి ఆమెనోసారి చూడాలనిపించింది. కాని వీలు పడలేదు. నేను నీరసపడి పోయాను.

రిక్షావాడికి డబ్బులిచ్చి, ఆ సంచిని ఆ ఇంట్లో పడవేయమని చెప్పి మేం ముందుకు సాగిపోయాం.

కొంత దూరం ఇద్దరమూ నడచాము. నేను నాలో సుడిగుళ్ళు తిరుగుతున్నాను. ఇంతలో వాడు 'మెయిల్లో వచ్చావా...' అన్నాడు. వట్టి పొడి మాట. నాకు బలే కోపమొచ్చింది. 'నా ఉత్తరం అందలేదా...'అన్నా. అతని చేత అబద్ధాలాడించాలని లేకపోయినా అలా అనకుండా ఉండలేకపోయాను. కాని వాడు వెంటనే 'అందింది...' అన్నాడు. నా మొగంలో నెత్తురు పిండివేయబడింది. వెంటనే, 'నువ్వు బాగామారావు...' అన్నా. దీనికి సమాధానంగా వాడు, 'నా మీద నీకు కోపంగా ఉందికదూ...' అన్నాడు. నాకు అదోలా అనిపించింది. 'ఎందుకు కోపం...' అన్నా నీరసంగా.

సూటిగా వెంటనే వాడు. 'నువ్వు అబద్ధాలాడటం ఎప్పటి నుంచి నేర్చుకొన్నావ్...' అన్నాడు, నా మీద అధికారిలా.

ఆ స్వరంలో ఏదో కర్కశత్వం ధ్వనించింది. నేనేమి మాట్లాడ కూడదనుకున్నా.

కాని, 'అబద్ధాలాడనని నేను నీ ముందేమీ ప్రతిజ్ఞ పూనలేదుగా...' అన్నా.

వెంటనే వాడు అంతవరకు నా కళ్ళల్లోకి సూటిగా చూడని వాడు; దీర్ఘంగా చూసి, గట్టిగా నవ్వాడు.

## భ యం క రం !

అది నవ్వు కాదు. విషవాయువుల భాండం నా మీద పగిలినట్లయింది! ఆ కళ్ళలో కుత్రిమాలు, దగాలు, దారుణ హత్యా ప్రయత్నాలు, అన్నీ కదలుతున్నాయి. ఆ పెదవుల మధ్య శబ్దజాలం, రక్త దాహంతో కాని తృప్తి చెందనట్లు బిగువైపోతోంది. ఆ దీర్ఘ నాసిక, ఎవరివో ఉచ్ఛ్వాస నిశ్శ్వాసలు పీల్చివేయడానికి సిద్ధపడుతూన్నట్లు ముందు కురుకుతోంది. ఆ భయంకరమైన నేత్రాలు, సమస్త సౌందర్యాన్నీ, చిందర వందర చేసివేయడానికి సిద్ధంగా ఉన్నట్లు విచ్చు కత్తుల సిపాయిల్లా అటు ఇటు తిరుగుతున్నాయి. ఒక సారి ఆ రెప్పలు ఇటు అటు కదిలాయి. జీవన్మరణాల మధ్య కొట్టుకుంటూన్న ప్రాణులను చూచి హసిస్తూన్నట్లు కనిపించాయి !

Thoughts ... కవిత Narration 3 hindrance ... (at times)



నేను నోరు తెరచుకొని అలా ఉండిపోయాను. ముసలి వాని తలమీది వెంట్రుకల్లా ఆకసం అతన్నిచూచి పాలి పోయింది! దయతో తొణికిసలాడే ఆ నేత్రాలలో ఇంతటి రాక్షసత్వం ఎక్కడనుంచి వచ్చింది? ఎలా వచ్చింది? నాకవ గతం కాలేదు.

నా వేదన గ్రహించాడో, లేక తన హృదయాన్ని విప్పి చెప్పాలని భావించాడో... తెలియదు కాని... వాడు ఒక్క సారి నిశ్చల మనస్కుడై పోయినట్లు నడుస్తూ నడుస్తూన్న వాడు మధ్యలో క్షణం నిలిచిపోయి, నా కళ్ళలోకి చూడ కుండ, ఆ తలను నావైపే త్రిప్పి, 'నా చేతినిండా ఇప్పుడు కావలసినంత డబ్బుందోయ్—' అన్నాడు.

నా తల పగిలిపోయింది. ఈ మాటలు విని నభోమండ లాన సూర్యుడు నెత్తురు కక్కుకున్నాడు! వీడిలో ఇలాంటి మార్పు ఎలా వచ్చింది చెప్మా అన్న ఆశ్చర్యం నాముందు కాగడాలా మండింది!

అప్పుడే వాడు, 'అశాంతిలో ఉన్న ఆనందం నీకేమైనా తెలుసా బ్రదర్...' అన్నాడు.

నా మొగం వేలబడి పోయింది.

పిచ్చిగా అనంత ఆకసంలోకి విలోకించాను.

నా కింతకు వాడు అర్థం కాలేదు. డబ్బు చేతిలో లేనంత కాలం, నీతులు చెప్పడం ఎంత సులభమో... ఈనాడు

నా కర్థమైనట్లు మరెవ్వరికీ కాదు. డబ్బుకోసం అందరూ తాపత్రయ పడతారు. కాని పాపాలు చెయ్యడానికి పిరికి తనం వహిస్తారు. పిరికి వాడికి డబ్బు దక్కదు. పాపాలు చేయడానికి ధైర్యం కావాలి. తెలివి కావాలి. తెలివి, ధైర్యము ఒక్క పాపాత్ముల జన్మహక్కు బ్రదర్...అశాంతి ఎక్కడైతే ఉందో, అక్కడే ఆలోచన ఆకసాన్ని చుంబిస్తుంది. ఎవడు పాపాలను చేస్తాడో వాడే అశాంతిని పొందుతాడు. వాడే అత్యంత ప్రతిభావంతంగా ఆలోచించ గలుగుతాడు. అలా ఆలోచించేప్పుడు ఎంత ఆనందంగా ఉంటుందో చెప్పు? అది కార్యరూపంలో పెట్టగలిగినప్పుడు ఇంకెంత ఆహ్లాదకరంగా ఉంటుందో ఎలా చెప్పగలం? అసలు నిజాయితీగా బ్రతకడమంటే అర్థమేమిటో తెలుసా? మనిషి తనకు ఏ మాత్రంజీవిత మనేది లేకుండా చేసుకోవడమే నోయ్...'

నా తల ముక్కలు ముక్కలై పోతోంది. కాని వాడన్న మాటలు, వాటి అంతరార్థాలు నాకగమ్యమైపోయాయి.

'నేను నా జీవితాన్ని నిలుపుకుంటున్నాను బ్రదర్... నేనిప్పుడు సుఖంగా బ్రతుకుతున్నాను. నీవేమిటో అప్పుడు తెగ చెప్పే వాడివి. అనంతమైన ఈ వెన్నెల్ని, ఈనదీ సౌంద ర్యాన్ని విడచి, ఈ రాజమండ్రీ 'ప్రజ' ఎలా ఈ కుళ్ళు కొంపల్లో కుసుకుతోందో అనేవాడివి. ఈనది ఒడ్డున,

ఆ వెన్నెల తళతళల్ని చూస్తూ, ఎప్పుడో ప్రాణాలు విడిచెయ్యాలని ఎంతో ఎంతో ఆశించేవాడివి. కాని ఇప్పుడేం చేస్తున్నావ్...ఓ చిన్న పిల్లకాలువైనా లేని ఊళ్ళో, పాదమంత ఓ పాత డొక్కు కొంపలో ఈసురోమని బ్రతుకుతూ మారని పోలికల్లా మారని రోజుల్ని పట్టుకొని మారకుండా బ్రతుకుతున్నావ్...' అన్నాడు.

ఈ మాటలతో నేను కొంత తేరుకున్నాను. తన ఆధిక్యతను నిరూపించుకోడానికి, వాడు ఆరాట పడుతున్నాడు!

'డబ్బు సంపాదించాలి బ్రదర్...ఆకాశంలో సూర్యుడు లేకపోతే ఈ లోకం ఎలాగుంటుందో, అలాగే మనిషి దగ్గర డబ్బు లేకపోతే అతని జీవితమూ అలాగే ఉంటుంది!

అప్పుడే ఓ కుర్రాడు మా దగ్గరకొచ్చి, 'నమస్కారమండీ శివరావుగారూ...' అన్నాడు.

వెంటనే మా శివం, 'నువ్వాటోయ్ ... మీ వాడికి చెప్పాలే...ఓ పట్టాన విన్నాడు కాదు. నాకు మండింది. బంగారంలాంటి కుర్రాడు...వాడింకో చోటికి పోయేవరకు ఇలాగే ఏడుస్తావు. ఆ తరువాత నీ మాట విన్నాను కాదని అఘోరిస్తావు. పది రూపాయిలు పెంచడానికి అలా చస్తావెందుకు — అన్నా. దీనితో మీ సావుకారు మొగం ఆముదం త్రాగిన వాడిలా పెట్టి మాట్లాడకుండా ఊరుకున్నాడు. మీకు తెలుసో తెలియదో కాని, అలా ముఖాన్ని

మార్చుకొనే పెద్ద మనిషి, తప్పకుండా మనం చెప్పిన దానికి అయిష్టంతో అంగీకరిస్తాడన్న మాట...మనకు కావలసింది డబ్బు కాని, వాడి కయిష్టం అయితే మాత్రం మన కేం... మెల్లగా దగ్గరకు పిలచి, జాగ్రత్తయ్యా ఆ అబ్బాయి మీ పోటీదారు షావులోకి జారిపోయేట్లున్నాడు చేతులార నిక్షేపంలాంటి వ్యాపారానికి ఉరిత్రాడు బిగించుకోకు. పది రాళ్ళకోసం చూస్తే పది సంసారాలు కూలిపోగలవు, నాకు తెలుసుగా నీవెన్ని సంసారాలు పోషించాలో ... అన్నా. దీనితో మనం చెప్పినదానికి గంగిరెద్దులా తలూపాడు!' అంటూ శివం, ఆ కుర్రవాడి వైపు సుతారంగా చూచి, సన్నగా మీసం మెలి వేసినట్లు నవ్వాడు.

ఆ అబ్బాయి ఒకటికి పది నమస్కారాలు పెట్టి అక్కడ నుంచి వెళ్ళిపోయాడు.

అతను ఇలా వెళ్ళాడో లేదో, శివం, వికటంగా వికృతంగా, నీచంగా నవ్వి, ఈ వెధవకి జీతం పెరగాలట! మనిషి కొంత ఎత్తు ఎదిగి ఆగిపోయినట్లు ఈ జీతం పెరుగుదలకూడ ఆగి పోతోంది కాని, లేకపోతే ఇంకేముంది? ఆకాశం నెత్తి పగిలి పోయేది! ఆ షావుకారు వీడ్ని తీసేస్తే, అడుక్కోడానికి కూడ పనికిరాడు. అయినా జీతం పెంచుతావా, మానే సేదా...అని నీలుగుతాడు. చూశావా ఎలాగుందో...

అయినా వీడివల్ల మనకు మంచి ఉపయోగముందని, ఓ చక్కని ఊహ తోచే సరికి, ఈ మాత్రపు మేలు వీడికి చేయడం అనవసరం కాదనిపించింది. దీనితో మనం ఆషావు కారు దివాళా తీసేందుకు ఒకటోరకమైన మార్గం వేసేశా మన్న మాట అంటూ పకపక నవ్వాడు.

నేను మూగవాణ్ణయిపోయాను. నా తలలో చేయిపెట్టి నా జీవనాడుల నెవరో వేళ్ళతో పీకుతూన్నట్లనిపించింది.

అప్పుడే ఓ లావు పాటాయన ఏమండోయ్...శివం గారు... దేవుడిలా కనిపించావయ్యా మహానుభావా... బాబ్బాబు...ఓ పది టన్నుల కిటికీ ఊచలు ఇప్పిద్దూ. నువ్వు కాదంటే కుదరదు. చాల అవసరం...అంటూ బ్రతిమాలే మొగాన్ని మావాడి ముందు, కారు హారన్ విన్నా కదలని గొడ్డులా పెట్టాడు.

శివం కొరడా దెబ్బలుకొట్టి అదలించినట్లు నవ్వి, 'అవసరానికి అరికాళ్ళు పుచ్చుకునే పెద్ద మనిషీ...అదికాస్తాతీరితే ఆవలి మొగం పెట్టే తుంటరీ.. దయచెయ్, దయచెయ్...' అన్నాడు.

అయినా ఆ పెద్దమనిషి కదల్లేదు. ఇలాంటి అవమానాల కల్తీ నూనెల్ని డబ్బుకు కక్కుర్తి పడి, మర్దించుకోవడం వల్ల, అందమైన శిరోజాలవంటి సుందరమైన మనసును

రాల్చేసు కున్న ఆ బట్టబుర్ర పెద్ద మనిషి—'నువ్వేమన్నా పడతాను. ఈ సారి కాదనకు బాబూ...' అన్నాడు.

మా శివం అనుమతి పత్రంలా నవ్వి, 'అలాగే అలాగే మనం తెచ్చిన రేటుకు ఖాయమేగా...' అన్నాడు.

అతను అలాగే అంటూ శివాన్ని మరీ మరీ బ్రతిమాలి వెళ్ళిపోయాడు.

నాకు పూర్తిగా మతిపోయింది. ఎటువంటి శివం ఎట్లా మారిపోయాడు!

ఇంతలో శివం ఓ ఇంటిగుమ్మం ఎక్కాడు. ఆ గుమ్మం లోకి అతనితో పాటు నేనూ రావడం అతని కళ్ళు అయిష్టతను ప్రకటించాయి. కాని ఇంతలోనే అవి చిత్రంగా మెత్తబడి పోయాయి.

ఆ ఇంట్లో మొత్తం ఎవ్వరూ కనిపించ లేదు. 'సుందరం' అని మా శివం గట్టిగా పిల్చాడు.

సుమారు ఆరడుగుల ఎత్తున్న అందమైన బలిష్టమైన మానవు డొకడు పెదవిమీది సిగరెట్టు జార్చి, అది క్రింద పడకుండా 'గుడ్ మార్నింగ్...గుడ్ మార్నింగ్...' అని ఆ సిగరెట్టును వ్రేళ్ళ సందుల్లో బంధించాడు. ఇతరుల జీవితాలను అలా, తమాషాగా ఇరికించుకొని, కాల్చేయడంలో ఉన్న సుందరమైన ఆనందాన్ని అతని మొగం ప్రకటిస్తోంది!

మా శివం, అతని వైపు నిశ్చలంగా చూచి 'ఎప్పుడు...' అన్నాడు. అతను, చెవిలో ఏదో చెప్పాడు. అప్పటి వారి కళ్ళు శృంగారాన్ని చమిక్కీలా అద్దుకొని తళుక్కుమన్నాయ్ !

'సరే నేను సాయంకాలం కనిపిస్తా' అంటూ శివం వీధిలోకి వచ్చేశాడు. ఆ సుందరం నాకు అతి వినయంగా నమస్కరించి, నా దగ్గర సెలవు తీసుకున్నాడు. అంత పర్సనాలటీ ఉన్నవాడు, నా ముందు అట్లా దిగజారిపోయి, తనను మరోలా భావించవద్దని, నమస్కరించినట్లే ఉన్న ఆ మేడిపండు మొగంలోని భావాన్ని గుర్తించ గలిగాను.

అప్పుడే మా వాడో రిక్షా మాట్లాడి నన్నందులో కూలబడేశాడు. నా అవస్థ గమనించాడు కాబోలు, 'బ్రదర్... మీ సిస్టర్ కు నువ్వంటే ఎంత ప్రేమనుకున్నావ్...నీగురించి నా దగ్గర ఎన్నిసార్లో చెప్పింది, నీ కెంతో సిగ్గట. నువ్వెంతో మంచివాడవట! ఇవన్నీ ఎలా తెలిశాయని అడగవేం... మా పెళ్ళి కొత్తలో నీ గురించి ఏమో చెప్పానట. అప్పటి నుంచీ నీలాంటి వాళ్ళు అరుదుగా ఉంటారని, ఏమిటేమిటో అంటుంది. నా మీద ఎప్పుడలిగినా నీ గురించే చెప్తుంది. నువ్వు నమ్ము, నమ్మకపో...మా దెబ్బలాటల గురించి నీ కప్పుడప్పుడు వ్రాస్తూ ఉండేవాడిని. అయితే ఇప్పుడు బాగా మారిపోయిందిలే. మునుపటిలా కాదు. ఇప్పుడు

పల్లెత్తు మాట అనదు. అసలు ఆడవాళ్ళ కోపాలు మాయ మయ్యేందుకు అర్థణా పూలు చాలు. ఈ చిన్న కిటుకు తెలియక చీరలు తెచ్చిపడేస్తాం. నగలు చేయించిపారేస్తాం. నేను అవీ ఇవీ కూడ చేస్తూఉంటాను. అంచాత ఆవిడగారు తన కోపాలకు, తాపాలకు నే నివ్వ తేలినబాకీ యావత్తుకొట్టి పారేసింది. నేను ఇంటికివస్తే వినసొంపైన మాటల పదార్థాలను ఒయ్యారంగా వడ్డించి, చిరునవ్వు వెన్నపూస నందు సుతారంగా కరిగించి, నా కష్టాల ఆకల్ని ఇట్టే మరపింప చేస్తుందోయ్. నేను అప్పుడప్పుడు ఆమెను కొట్టినమాట వాస్తవమే! ఈ విషయం నీకు తెలుసు. కాని అలా ఆడవాళ్లను కొట్టడమంత బుద్ధితక్కువపని మరొకటిలేదు బ్రదర్... ఆమాటకొస్తే ఈ లోకంలో ఎవ్వరినీ కొట్టగూడదు. మాటల చాతుర్యంతో మనిషిని ఆటలాడించెయ్యాలోయ్...మనిషిని ఏడిపించడానికి, నవ్వించడానికి, మాటలకున్న బలం దేనికుంది? ఇది తెలియని బుద్ధితక్కువవాళ్లు చేయి చేసుకుంటారు. నేను చేయి చేసుకున్నంతకాలం, నాకు లోకజ్ఞానంలేదని ఇప్పుడొప్పుకోవలసి వస్తోంది. ఒక రహస్యం చెప్తానువిను... ఆడవాళ్లు మగవాళ్ళను ప్రేమించడమనే పొరపాటు ఎప్పుడూ చేస్తూఉంటారు. ఈ విషయం వాళ్లకు తెలియదు. వాళ్లకు శిక్షపడుతూన్న దిందుకైనా...వాళ్ళిదేమీ అర్థంచేసుకోరు. దీనికి మనమేం చేయగలం? మనం నిజమే చెప్పేస్తాం. నువ్వు

నాకిష్టం లేదు తల్లీ......నీకోనమస్కారం. దయచెయ్యి... అని. వాళ్లు దీన్నేమనుకుంటారో తెలుసా...మనల్ని పర స్త్రీలు వాంఛిస్తున్నారని, మనం నిజంగా ఎంతో మంచివాళ్ళ మని, నిక్కచ్చిగా నిర్ణయించేసుకుంటారు. అందుకనే వాళ్ళు అమాయకులంటాను. అమాయకులకు మోసగించబడట మంటే ఎంతో ఇష్టం. అసలు వాళ్ళకు అమాయకంగా ఉండటం తప్పించి ఇంకేమీ చాతగాదు. మోసగించ బడటంవల్లనే వాళ్ళు నిజానికి ప్రజల నోళ్లల్లో పడుతున్నారు. ఈ వెర్రి ప్రజలు వాళ్లను 'ఎంత మంచివాళ్ళు...ఎంత అమాయకులు' అనేస్తారు. ఈ మాటలంటే ఆ అమాయకుల కెంతో ఇష్టం. ఇందుకనే, నేను ఏమంటానంటే ఇటువంటి వాళ్ళను తృప్తి పరచడానికైనా చెడ్డవాళ్లు తప్పనిసరిగా ఉండవలసివస్తోందని. నామట్టుకు నేను ఎన్ని చెడ్డపనులుచేశానో లెక్కలేదు. అసలు లెక్కలేకపోవడం గొప్ప కానేకాదు, అలాంటివి ఈ ప్రజసహించడంలోనే ఉంది గొప్ప అంతాను! నిజానికి వాళ్ళల్లోనూ నాకున్నన్ని దురుద్దేశాలే ఉంటాయి. కాని వాళ్ళు ఆచరణలో పెట్టలేరు. నేను వాటిని సునాయాసంగా చేసెయ్యగలను. అలాంటప్పుడు వాళ్ళేమనుకుంటారో తెలుసా...పోనిస్తూ ... అప్పుడప్పుడు అలాంటి తప్పులు మనమూ చిన్నెత్తులో చేస్తూ ఉంటాము. అంతకన్నా దారుణంగా ఎప్పుడూ ఊహిస్తూనే ఉంటాం. చెయ్యాశం ఎంత

తప్పో...మరి ఊహించడమూ అంతే తప్పు...అని, వాళ్లు అనుకొని, పోనిస్తూ...వాడెలాపోతే మనకేం...అని క్షమించేస్తారు. ఇదేనోయ్ ఈ ప్రజల బలహీనత! ఇంకొక టేమిటంటే ఈ ప్రజలు ఛస్తే ఎప్పుడూ మంచివాళ్లు కాలేరు. అందువల్ల అంతవరకు మన దేరాజ్యం. అసలు కోటికొక్కడు లేని మంచివాడికోసం, మనకెందుకు తాపత్రయం. నిజానికి మంచివాడంటే ఎవడో తెలుసా...వక్రికోపిష్ఠి, తెలివితక్కువ దద్దమ్మ, ముందుచూపు లేనివాడు, గతాన్ని ఎప్పుడూ నెత్తిమీద పెట్టుకొనేవాడు, ప్రపంచాన్ని చూడనివాడు. ఒంటరిగాడు. అతన్ని అనుకరించేవారిని చూచి సహించలేనివాడు, తనమాటే పైన ఉండాలని మొండిపట్టుదలగలవాడు. గర్విష్ఠి...తను దేవునితో సమానమని సంతోషించువాడు. విర్రవీగువాడు. బహుశా అయిఉండవచ్చు! ఇలాంటి మంచివాళ్లను గురించి నే నెక్కువగా బుర్రపాడుచేసుకోను. నేను పాడుచేసుకునేదల్లా మాలాంటివాళ్ళే కొంతమంది ఉంటారు. వాళ్లంటే నాకు భయం. వాళ్లతో పోటీపడటం బహుకష్టం!' అని ఆగిపోయాడు.

నేను ఆశ్చర్యపోయాను. శివం జీవితంలో ఏదో అద్భుత శక్తి కదలుతోంది. అతను నిజంగా అసామాన్యవ్యక్తి. అతను ఎన్ని పాపపుపనులు చేసినా, భయపడడు. భయం అతనిలో తొంగిచూడటమనేది కలలోని వార్త. అతను

మృత్యువును తీయగా ఆహ్వానించగలడు. అంతకన్నా దారుణ మైన అవమానాలను, ఒక్క ఈసడింపుతో తుడిచి పారవేయ గలడు. మనమంతా, 'రాక్షసుడా...అని తిట్టినా, అతను దానికి కించిత్తూ చలించక, పై పెచ్చు నిండు హృదయంతో గర్వించగలడు. ఇక అతన్ని ఏ పాపమంటుతుంది? అతన్ని ఏ శక్తి అణచివేయగలదు? అబ్బ! అతను జినుడు. దేనికీ లొంగడు!

రిక్షా ఇంటికి వచ్చేసింది. ఇటువంటివాని దగ్గర పాపమా ఇల్లాలు ఎట్లా బ్రతుకగలుగుతూందో అన్న సంశయం నన్ను పీడించ మొదలు పెట్టింది. ఇందాక నేను ఆ యింటికి వచ్చి నప్పుడు, ఆమె వీధిలో భర్తను సాగనంపుతూన్న విధానం నా కళ్ళముందు అతివిషాదంగా మెదిలింది. తిరిగి ఆమె నొక సారి చూడాలనిపించింది. ఆమె సహనానికి చేతులెత్తి నమస్కరించా లనిపించింది. వెంటనే నా దృష్టి ఆ గుమ్మం వైపు పరుగులు పెట్టింది. చిత్రం......ఆ ఇంటికి తాళం వేయబడి ఉంది!

ప్రక్క ఇంటిలోని ఓ ముసలమ్మ అప్పుడు ఎంతో బాధతో శివానికి తాళం చెవులిస్తూ, "ఎందుకు వెళ్ళి పోయిందో ఏమో నాయనా...ఆమెకు తెలియాలి. నీకు తెలియాలి..." అంటూ వెళ్ళిపోయింది.

శివం మొగం కత్తివాటుకు నెత్తురుచుక్క లేకుండా అయిపోతుందనుకున్నాను. నా నోటమాత్రం మాటలేదు, అలాగే కొయ్యబారిపోయాను.

శివం మెల్లిగా, "ఇదిగో మూర్తీ...ఆడవాళ్ళకు తొందరెక్కువ. ఆ తొందరలో వాళ్ళ సుఖాలనే కాదు మనసుఖాలనూ పాడుచేస్తారు. కాని ఒకటి చెప్తాను విను. ఈ ఆడవాళ్లున్నారే...వాళ్లు, మనమంతా భయపడే చావును గురించి భయపడరోయ్. కాన్పు వచ్చినప్పుడల్లా వాళ్లు ఆ 'చావు' రుచి తెలుసుకుంటారు. దీనితో వారికి చావంటే అతిచులకన! అంత భయంకరమైన చావే చులకనైనప్పుడు మిగిలిన కష్టాలు వారికి ఒక లెక్కలోకి రావు అంచాతనే ఆడవాళ్ళు దేన్నయినా ఎలాంటి కష్టాన్నయినా ఇట్టే సహించగలరు...అన్నాడు.

ఈ మాటలు అతను దేనికి చెప్తున్నాడో, ఎందుకు చెపుతున్నాడో అర్థం చేసుకున్నా. పాపం భార్యతిరిగి వచ్చేస్తుందని అతను విశ్వసించాడు. కాని అలా జరుగలేదు. వారం రోజులు తిరగక మునుపే ఆమె ఆత్మహత్య చేసుకున్నదన్నవార్త పేపర్లో చూశాను ... అంతే...నా కన్నులలో నీటిబిందువులు నిలచి, భూమిపై రాలకుండా ఇంకిపోయాయి. కాని శివం, ఆ తరువాత బైరాగుల్లో కలసిపోయాడన్న చిత్రమైన వార్త విన్నాను. ఎంతమట్టుకు నిజమోమరి?